సేవా కార్యక్రమాలు తృప్తినిస్తాయి



అన్నదానంలో పాల్గొన్న ప్రజలు, అసోసియేషన్ సభ్యులు

మణికొండ: సేవా కార్యక్రమాలు చేస్తే ఎంతో తృప్తి కలుగుతుందని మణికొండ మున్సిపాలిటీ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి అన్నారు. శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని అలకాపూర్ టౌన్‌షిప్‌లోని అసోసియేషన్ కార్యాలయం ఎదుట పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేస్తే వారి దీవెనలు అందుతాయన్నారు. ప్రతి అమావాస్యకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వందలాది మంది భోజనం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి దేవిశెట్టి శ్రీధర్, కోశాధికారి బి.బ్రహ్మానందంతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశ ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

శంషాబాద్: పట్టణంలోని మల్లికా కన్వెన్షన్‌లో ఈ నెల 12 న నిర్వహించనున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం బీజేపీ ముఖ్య నేతలు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకులు, ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రులతో పాటు వెయ్యి మందికి పైగా నేతలు పాల్గొంటారన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొల్ల మాదవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, సీనియర్ నాయకులు అంజన్‌కుమార్ యాదవ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్, చింతల నందకిశోర్ గుప్తా, బుక్క వేణుగోపాల్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

ఘనంగా స్వామిగౌడ్ జన్మదిన వేడుకలు



శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: శాసన మండలి మాజీ చైర్మన్ కనకమామిడి స్వామిగౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆయన నివాసంలో జరిగిన వేడుకల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పాల్గొని ఆయనతో కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్, నాయకులు సురేష్‌గౌడ్, మలాకీరత్నం, అంతరాం నరేష్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జంతు ప్రేమికులారా జాగ్రత్త

పెంపుడు జంతువులకు తప్పని సరిగా టీకాలు వేయించాలి

- వ్యాధులు సంక్రమించకుండా అప్రమత్తత అవసరం
- ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచితంగా వ్యాక్సిన్లు
- జూలై 6న వరల్డ్ జూనోసిస్ డే



రాజేంద్రనగర్‌లోని పశువైద్య విశ్వవిద్యాలయం క్లినికల్ కాంప్లెక్స్





కుక్కలకు వైద్యం చేస్తున్న దృశ్యం

ఏజీవర్సిటీ: జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువులకు తప్పని సరిగా కనీసం 6 నెలలకు ఒక సారి టీకాలు ఇప్పించాలని పశువైద్యులు సూచిస్తున్నారు. జంతువులను ప్రేమించడం అభినందనీయమే అయినా వాటి పెంపకంలో కొన్ని సూచనలు, జాగ్రత్తలు పాటించాలని వైద్యులు పేర్కొంటున్నారు. చాలామంది ఇంట్లో పెంచే కుక్కలకు టీకాలు ఎందుకని అవి కరిచినా, గీరినా నిర్లక్ష్యం చేస్తుంటారు అయితే ఇది చాల ప్రమాదమని తప్పని సరిగా మనుషులతో పాటు పెంపుడు జంతువులకు కూడా టీకాలు వేయించాలని సూచిస్తున్నారు. రైతులు, జంతు ప్రేమికులు, జంతు వధశాలో పనిచేసే కార్మికులకు జూనోటిక్ మరిసిస్ వ్యాధులు సంక్రమించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ వ్యాధులు సంక్రమించకుండా ప్రజలను అప్రమత్తం చేసేందుకే ఏటా జూలై 6న జూనోసిస్ డేగా జరుపుకోవడం అనవాయితీ. కుక్కకాటు బారిన పడిన ఓ బాలుడికి టీకా మందు ఇచ్చి బతికించిన రోజు జూలై 6 కావడంతో ఇదే రోజున ప్రపంచ వ్యాప్తంగా జూనోసిస్ దినోత్సవంగా నిర్వహిస్తున్నాయి.

ఉచితంగా రేబిస్ టీకాలు

ప్రపంచ రేబీస్ డే సందర్భంగా రాజేంద్రనగర్‌లోని పీవీ నరింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శనివారం వెటర్నటీ కాలేజీలోని వెటర్నటీ క్లినికల్ కాంప్లెక్స్‌లో ఉచితంగా రేబీస్ టీకాలు ఇస్తున్నారు. ఇందులో భాగంగా నిర్వహించే కార్యక్రమంలో రేబీస్ టీకాలు సంబంధించి వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారు. వారి ఉత్పత్తి వివరాలు, వ్యాక్సిన్లు పనిచేసే విధానం, వ్యాక్సిన్లు ఏ విధంగా వాడాలి, రేబీస్‌ను ఏలా నివారించాలో జంతువులతో పాటు మనుషులకు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో అతర్జాతీయ రేబీస్ మందుకు సంబందించిన కంపనీలు, ఇండియన్ ఇమ్యూనలజికల్, పాస్, మ్యాన్ కైండ్ తదితర కంపనీల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు పాల్గొంటున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వ్యాక్సిన్లు ఇస్తారని పెంపుడు జంతువుల యజమానులు ఈ అవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

యాంటి రేబీస్ వ్యాక్సిన్లు తప్పనిసరి



జంతువుల నుంచి ప్రాణాంతకమైన రేబీస్ వ్యాధి సోకకుండా తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలి. చాల మంది ఈ విషయంలో చాల నిర్లక్ష్యం చేస్తుంటారు కాని ఇది చాలా ప్రమాదకరం. నెల రోజుల క్రితం పెంపుడు జంతువు కరిచినా నిర్లక్ష్యం చేయడంతో తండ్రి, కొడుకులు మృతి చెందారు. జూలై 6న వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌లో ఉచితంగా వ్యాక్సిన్లు వేస్తున్నాం. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

- రామ్‌సింగ్ లకావత్ ,అసోసియేట్ ప్రొఫెసర్ పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం

మణికొండ అక్రమాలపై ఫిర్యాదు



మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని పార్కు స్థలాల అన్యాక్రాంతం, రహదారుల కబ్జా, ఫేక్ టీడీఆర్‌లతో అనుమతులతో ఇష్టారాజ్యంగా అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, వాటిని అరికట్టాలని మణికొండ ది సిటిజన్స్ కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సరైన రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా లేకపోయినా ఇష్టారాజ్యంగా హెచ్‌ఎండీఏ నుంచి అనుమతలు జారీ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏ నుంచి తీసుకున్న అనుమతులు పుట్టింగ్‌ల స్థాయిలో ఉండగానే వాటికి మురుగునీటి డ్రైనేజీ సౌకర్యం కల్పించిన ఘనత మణికొండ మున్సిపాలిటీకి దక్కిందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షేక్ ఆరీఫ్, కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎ.లక్ష్మణ్‌రావు తెలిపారు.

13న సీబీఐటీలో గ్రాడ్యుయేషన్ డే

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో 2020 నుంచి 2024 మధ్య యూజీ, పీజీ పూర్తి చేసుకున్న వారికి గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు తెలిపారు. కార్యక్రమంలో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు, డిగ్రీల ప్రదానం ఉంటుందన్నారు. పలువురు వక్తలు, ముఖ్య అతిథులు ఇందులో పాల్గొంటారని పూర్వ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పత్తికుంట చెరువులో పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వై.శ్రీధర్, జి.బాబురావు తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని పత్తికుంట హనుమాన్‌సాగర్‌లో గణేష్ నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువును శుభ్రం చేయిస్తున్నట్లు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. రెండు రోజులుగా చెరువులో మట్టి, చెత్త చెదారాన్ని తొలగిస్తున్నామన్నారు. గత నెలలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి వర్షాలు కురియక ముందే పత్తికుంటను శుభ్రం చేయాలని వినతిపత్రం అందజేశామన్నారు. రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్, ఈఈ నరేందర్ గౌడ్, ఏఈ వెంకోబా సహకారంతో చేపట్టిన పనులను శుక్రవారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వై.శ్రీధర్, జి.బాబురావు, భాస్కర్ యాదవ్, తొండుపల్లి మల్లేష్, పవన్ రాజ్, డి.యాదగిరి, జంగయ్య, భీమయ్య తదితరులు పరిశీలించారు.

బీజేవైఎం నేతల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో బీజేవైఎం నాయకులు


రాజేంద్రనగర్: భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిరుద్యోగుల సమస్యలపై శుక్రవారం తలపెట్టిన కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. తెల్లవారుజాము నుంచి రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని బీజేవైఎం రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలించారు. మధ్యాహ్నం వ్యక్తిగత పూచీకత్తులపై వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువ మోర్చా మీడియా కో–ఆర్డినేటర్ కిరణ్ చారి, రాజేంద్రనగర్ డివిజన్ పార్టీ అధ్యక్షులు రాకేశ్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ఉదాసనీత ప్రదర్శిస్తుందని ఆరోపించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన చేపట్టేందుకు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సహాయంతో కార్యక్రమాన్ని అడ్డుకుంటుందని ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులు, అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరన్నారు. మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో దాదాపు 50 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఐటీ చెల్లించే రైతులకూ 'భరోసా' కల్పించాలి



పీఏసీఎస్ సమావేశంలో పాల్గొన్న కార్యవర్గసభ్యులు

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ఆదాయపన్ను(ఐటీ) చెల్లిస్తున్న రైతులకూ వర్తింప చేయాలని నార్సింగి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) సభ్యులు అన్నారు. శుక్రవారం చైర్మన్ కృష్ణ అధ్యక్షతన ఖానాపూర్ గ్రామంలోని రైతువేదికలో సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా కోఆపరేటివ్ కార్యాలయం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆర్ఎంపీ ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం రైతులకు ఇవ్వాలనుకుంటున్న రైతు భరోసా పథకంపై ప్రతి పీఏసీఎస్ నుంచి తీర్మానాలు కోరుతుందని, అందుకు అనుగుణంగా తీర్మానం చేయాలన్నారు. దాంతో మెజార్టీ రైతులు కార్లు, ఇళ్లు కొనుగోలు, బ్యాంకు రుణాల నిమిత్తం రైతులు తప్పనిసరి ఐటీ చెల్లించాల్సి వస్తుందన్నారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న అలాంటి రైతులతో పాటు మిగతా రైతులకు రైతు భరోసా పథకాన్ని వర్తింప చేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఘనంగా బ్రహ్మోత్సవాలు



మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 13లోని శ్రీ సీతారామచంద్ర అభయాంజనేయస్వామి దేవాలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 8 వరకు కొనసాగనున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యారాధన, సేవాకాలం, వేద విన్నపాలు, ద్వార తోరణ, ధ్వజ కుంభారాధన, బలిహరణ, మంగళస్నానాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, ఎదుర్కోళ్లు నిర్వహించారు. శనివారం ఉదయం 10గంటలకు శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం ఉంటుందని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ వి. నాగరాజు కోరారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

లంగర్‌హౌస్: చిన్నారులకు సరైన భోజనం అందించడంతో పాటు ఆటాపాటలు కచ్చితంగా నేర్పాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం లంగర్‌హౌస్‌లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విషయం తెలిసిన స్థానిక నాయకుడు మాతంగి రమేష్ అక్కడకు వెళ్లి సమస్యలను వివరించాడు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

గోల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు మెగా సిస్టమ్స్, టీచ్ ఫర్ చేంజ్ సంయుక్తంగా కృషి చేస్తున్నాయని మెగా సిస్టమ్ ప్రతినిధి ధరణికోట సుయోధన్ అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని దేవల్ ఝామ్‌సింగ్ ప్రభుత్వ, ఉన్నత పాఠశాలలో టాయిలెట్స్, నీటి ట్యాంక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద బస్తీలలో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో మరింత మంది విద్యార్థులు చేరేలా గత దశాబ్ద కాలంగా తాము నగరంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ రంజిత, బీజేపీ నాయకులు దేవర వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



కాళీమందిర్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బండ్లగూడ: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులను నివారించేందుకు అధికారులు, సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాళీ మందిర్ చౌరస్తాలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైన ఆమె జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా, దోమలు రాకుండా జాలీలు వాడటం, మస్కిటో రిపేలెంట్స్ ఉపయోగించాలన్నారు. ప్రతి శుక్రవారం ప్రతి కాలనీలో డ్రై డే ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బి.శరత్‌చంద్ర, 20వ డివిజన్ కార్పొరేటర్ సాయి సాగర్‌గౌడ్, 11వ డివిజన్ కార్పొరేటర్ అస్లాం, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, డిఈఈ జి.యాదయ్య, ఏఈఈ రాజకుమార్, ఆర్‌ఐలు శివ, కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, టీఎంసీ శ్రీలత, జూనియర్ అసిసెట్లు శ్రీశైలం, సూర్యప్రకాష్, కిష్టయ్య, శంకరయ్య, వెంకటప్ప, రవి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, మెప్మా మహిళలు, శానిటరీ జవాన్లు, స్వీపర్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే కాలుష్య నియంత్రణ



అత్తాపూర్: ప్రతి విద్యార్థి మొక్కలు నాటి కాలుష్య రహిత సమాజానికి పాటుపడాలని రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ అత్తాపూర్ హైదర్‌గూడ బ్రాంచ్‌లో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ... చదువుతో పాటు విద్యార్థులు చెట్లు పెంపకం భాగం కావాలన్నారు. వాతావరణంలో పెను మార్పుల కారణంగా రుతువులు కూడా మారుతున్నాయన్నారు. ఓజోన్ పొర పలచడటమే ప్రకృతి వైపరీత్యాలకు కారణమన్నారు. వేప,రాగి, కానుగ తదితర చెట్లతో పాటు మామిడి, బత్తాయి, సపోటా, నేరేడు,ఉసిరి, జామ చెట్లను నాటాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే డ్రగ్స్ రహిత సమాజం



యువతకు కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్

మైలార్‌దేవ్‌పల్లి: యువత మత్తుకు బానిసలు కాకుండా డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి నరేందర్ అన్నారు.శుక్రవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్ ,టీఎన్జీవోస్ కాలనీలలో యువతకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత బెట్టింగులకు పాల్పడి తమ ఆస్తులను సైతం అమ్ముకునే స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు.డ్రగ్స్‌కు అలవాటుపడి మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు.డ్రగ్స్ సేవించే వారిపై నిఘా పెట్టి వాటిని నిరోధించడానికి ప్రజలు సహకరించాలని కోరారు. కాలనీల్లో దొంగతనాలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను కోరారు. వచ్చే బోనాల పండుగను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కొత్త చట్టాలు కఠినంగా ఉన్నాయని యువత నేరాలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సెక్టర్ ఎస్ఐ క్రిష్ణయ్య ,కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎస్ వెంకటేష్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు



శివ కుమార్

రాజేంద్రనగర్: లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ రాజేంద్రనగర్ ఫోక్సో కోర్టు న్యాయమూర్తి పి.అంజనేయులు శుక్రవారం తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ.5 లక్షల నష్ట పరిహారాన్ని అందించాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శంషాబాద్ ఆర్‌జీఐ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హుడా కాలనీకి చెందిన జె.శివ కుమార్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఇదే కాలనీకి చెందిన మైనర్ బాలిక (14)ను ప్రేమిస్తున్నానని నమ్మించి కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రశాంతంగా కౌన్సిల్ సమావేశం

పనులపై నిలదీసిన కౌన్సిలర్లు

- లెక్కలు చెప్పాల్సిందేనని డిమాండ్
- రహదారులను బాగు చేయండి
- త్రైబజార్ వేలానికి తీర్మానం
- విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయింపు
- వైస్ చైర్మన్‌కు అవకాశం ఇవ్వాలి



మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న పాలకకమిటీ సభ్యులు

మణికొండ: మణికొండ మున్సిపల్ అత్యవసర సమావేశం శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. గత సమావేశంలో కొన్ని వార్డుల్లో పనులు పెట్టకపోవటంతో వాటిపై తీర్మానం చేసేందుకు గాను అత్యవసర సమావేశం నిర్వహించారు. మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా ఎంజెండాలో పొందు పర్చిన 30 అంశాలతో పాటు మరొకటి అదనంగా తీర్మానం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, వాటికి వెంటనే ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలని, కొత్తవి వేయాల్సిన చోట వెంటనే పనులను ప్రారంభించాలని మెజార్టీ కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తెచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో కౌన్సిలర్ల ఆమోదం లేకుండా ఎలాంటి రోడ్డు కట్టింగ్‌లకు అనుమతులు ఇవ్వవద్దని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మరో 440 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ అవసరమని, అందుకు స్థలం కేటాయించాలని విద్యుత్ ఏఈ సందీప్‌రెడ్డి కోరిక మేరకు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసి స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. జల మండలి సిబ్బంది ఇష్టారాజ్యంగా రోడ్లను తవ్వారని, వాటిని వెంటనే వారి చేతనే మరమ్మతులు చేయించాలన్నారు.

కౌన్సిలర్లు లేవనెత్తిన మరికొన్ని అంశాలు...

- మున్సిపాలిటీ పరిధిలో పనులు పూర్తి చేసుకున్న జలమండలి రిజర్వాయర్‌లు, ట్యాంక్‌లను వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.
- ఈ సంవత్సరం జనవరి నుంచి జూన్ వరకు తీర్మానాలు లేకుండా చేపట్టిన పనుల వివరాలు, ప్రస్తుత, గత ఆర్థిక సంవత్సరాల ఆడిట్ నివేదికలను కౌన్సిలర్‌లకు ఇవ్వాలి.
- మున్సిపాలిటీలో జరిగిన సమావేశాల మినిట్స్‌ను నమోదు చేసి వెంటనే జిల్లా కలెక్టర్, సీడీఎంఏ కార్యాలయాలకు పంపాల్సి ఉన్నా ఎందుకు పంపటం లేదని ప్రశ్నించారు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కొత్తగా త్రైబజార్ వేలం వేసుకునేందుకు తీర్మానం చేశారు.
- హుడా కాలనీ అంబియాన్స్ ఫోర్ట్ , ల్యాంకో జీ సర్కిల్ పక్కన నిర్మాణంలో ఉన్న టీం ఫోర్ గేటెడ్ కమ్యూనిటీ ల మురుగునీటిని పందెన్ వాగులో కలిపేందుకు ఇచ్చిన అనుమతి పత్రాలను కౌన్సిలర్‌లకు ఇవ్వాలి.
- ఐదేళ్లు పూర్తి కావస్తున్నందున ఒకసారైనా అధ్యక్ష స్థానం వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డికి ఇచ్చి సమావేశం నిర్వహించాలి.

తీర్మానాలు ఇవీ...

- సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.12.06కోట్లు, విద్యుత్ పనులకు రూ. 32లక్షలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.10.4 కోట్లు, క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధికి రూ. 1.30 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ. 1.22 కోట్లు ఖర్చు చేయాలని తీర్మానం చేశారు.
- సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్, వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, మేనేజర్ రమేష్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సంజయ్‌కుమార్, టీపీఓ సంతోష్‌సింగ్, అకౌంటెంట్ వీరస్వామి, విద్యుత్, జలమండలి తదితర శాఖల అధికారులు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.